www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 2 ఆగస్టు 2025
5
పశ్చిమ గోదావరి

17 వందల మార్గదర్శకులచే 35 వేల కుటుంబాల దత్తత

ప్రజాశక్తి - భీమవరం

జిల్లావ్యాప్తంగా పి-4 లో 17 వందల మార్గదర్శకులను రిజిస్ట్రేషన్ చేసుకుని 35 వేల కుటుంబాలను దత్తత తీసుకున్నామని ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని వివిధ పరిశ్రమల యాజమాన్యాలతో నిర్వహించిన పి-4 అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో దిగువస్థాయి పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పి-4 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. వివిధ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు స్పందిస్తూ పి-4 లక్ష్యాన్ని తమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి భాగస్వాములయ్యేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు యు.మంగపతిరావు, కంటిపూడి శ్రీనివాసరావు, నాగలింగాచార్యులు, జి.స్వాతి పాల్గొన్నారు.

బోధనేతర పనులతో కుస్తీ.. విద్యాబోధనకు సుస్తీ..!

- ప్రభుత్వ తీరుపై గురువులు గరంగరం
- యాప్, ఆన్‌లైన్ నమోదు పనులతో అవస్థలు
- 12వ పిఆర్‌సి కమిషన్ కోసం ఎదురుచూపులు
- ఒక్క డిఎ కూడా ఇవ్వకపోవడంపై ఉపాధ్యాయుల పెదవివిరుపు
- నేడు ఫ్యాప్టో ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఒకప్పుడు పాఠాలు చెప్పడంలో బిజీబిజీగా ఉండే గురువులు నేడు యాప్, ఆన్‌లైన్ పనులతో కుస్తీ పడుతున్నారు. పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయిస్తూ ఉపాధ్యాయ వృత్తినే అవమానిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయులు గరంగరంగా ఉన్నారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నాకు సిద్ధమయ్యారు.

ప్రభుత్వ విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం విద్యారంగ మూలాలను దెబ్బతీసేలా ఉపాధ్యాయులను విద్యాబోధనకు దూరం చేస్తుండటం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. గురువులపై బోధనేతర పనుల భారం రోజురోజుకీ పెరుగుతుండటం గమనార్హం. దీనిపై ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ప్రతిరోజూ వాట్సప్‌లో అర్జెంట్, మోస్ట్ అర్జెంట్ అంటూ మెసేజీలు, ఆన్‌లైన్ పనులు చేయాలని ఆదేశిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 1428 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు ఏడు వేల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఆ తర్వాత స్కూల్ ఆర్గనైజేషన్ టీముల (ఎస్ఓటి), ఎంఇఓ, బదిలీల కౌన్సెలింగ్ నిర్వహణతో 15 రోజులు గడిచిపోయాయి. అనంతరం గిన్నిస్ రికార్డు పేరిట జూన్ 21న చేపట్టిన యోగాంధ్ర కోసం పాఠశాలల్లో ముందస్తు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ఉపాధ్యాయులను, విద్యార్థులను భాగస్వాములను చేశారు. గత నెల 10న నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ (పిటిఎం)కు పది రోజులు ముందుగానే సన్నాహక కార్యక్రమాలు నిర్వహించారు. ఇవి ముగించుకుని హమ్మయ్యా.. అనుకునేసరికి ఈ నెల 14 నుంచి స్కూల్ లీడర్‌షిప్, ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) వంటి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించారు. ఇటువంటి వాటితో తమ సమయం వృథా అవుతోందని, అనివార్యంగా బోధనకు దూరమవ్వాల్సి వస్తోందని ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ఒకవైపు ఉపాధ్యాయులు అనేక రకాల పనులతో సతమతమవుతుంటే విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు సైతం సమయం సరిపోని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యారంగం, దానిలోని పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది.

ఒకపక్క యాప్, మరోపక్క ఆన్‌లైన్ పనులు

పాఠశాల విద్యాశాఖలో ఉన్న అన్ని యాప్‌లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) యాప్ రూపొందించారు. దానిలోనే ఐఎంఎంఎస్, స్టూడెంట్ కిట్స్, మెగా పిటిఎం వంటివన్నీ ఉంచారు. సర్వర్ సక్రమంగా లేకపోవడంతో ఆన్‌లైన్‌లో టీచర్ ఫొటో హాజరు నమోదు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలస్యమవుతోంది. మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం అందిస్తున్నారు. ప్రతి నెలా పాఠశాలకు అందిన అన్ని బియ్యం బస్తాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌లను ఉపాధ్యాయులు స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. వంటకు ముందు ఆ బస్తా తెరిచిన ప్రతిసారీ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, బియ్యం నాణ్యతను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. బియ్యం, సరుకులు, యూనిఫారం, పాఠ్య పుస్తకాల వంటివి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి తెచ్చుకోవడం తదితర పనులను ఉపాధ్యాయులే చేయాల్సి వస్తోంది. వివిధ పనులకు సంబంధించి ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు 500 నుంచి వెయ్యి వరకూ ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. ఇంటర్‌నెట్, సర్వర్ సమస్యతో ఇవి ఏ సమయానికి అప్‌లోడ్ అవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీని వల్ల టీచర్ల సమయం వృథా అవుతోంది. లీడర్‌షిప్ ట్రైనింగ్ రెండో విడత నిర్వహిస్తున్నారు. మండలస్థాయిలో హెచ్ఎంలు, ఎంఇఒలు గంటల తరబడి ఈ సమావేశాల్లో పాల్గొనాల్సి వస్తోంది. ఈ నెల 4 నుంచి ఎఫ్ఎ-1 పరీక్షలు ఉన్నందున సిలబస్ పూర్తి చేయాల్సి ఉండగా, ఈ సమయంలో తమపై ఇన్ని బోధనేతర పనులు మోపడమేమిటని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొజిషన్ ఐడీలు రాక రెండు నెలల జీతాలు పెండింగ్

బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ముగియడంతో జిల్లావ్యాప్తంగా దాదాపు రెండు వేల మంది ఉపాధ్యాయులు ఆయా ప్రాంతాలకు వెళ్లారు. గతంలో రెగ్యులర్‌గా జీతాలు తీసుకుంటున్నప్పటికీ బదిలీ అనంతరం మరో స్థానానికి వెళ్లడంతో వారికి ప్రభుత్వం పొజిషన్ ఐడి కేటాయించాలి. ఇది జరిగితేనే సిఎఫ్ఎంఎస్‌లో వారి వివరాలు కన్పిస్తాయి. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు పొజిషన్ ఐడీలు కేటాయించకపోవడంతో సుమారు 17 వందల మందికి జీతభత్యాలు నిలిచిపోయాయి. బదిలీ అయిన ప్రాంతంలో జీతాలు తీసుకునేలా అక్కడి డిడిఒకు సమాచారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. మోడల్ ప్రైమరీ స్కూల్, అప్‌గ్రేడ్ చేసిన ఉన్నత పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నచోట అదనంగా మరో మూడు పోస్టులు ఇచ్చినా, పొజిషన్ ఐడీలు కేటాయించలేదు. దీంతో ఆయా ఉపాధ్యాయులకు జీతాలు రాక వారంతా సతమతమవుతున్నారు. బదిలీ అయిన వారికి జూన్, జులై జీతాలు రాని పరిస్థితి. దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కలెక్టరేట్ వద్ద నేడు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నాకు ఉపాధ్యాయులు సన్నద్ధమయ్యారు. ఈ నెల రెండో తేదీ శనివారం భీమవరం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేపట్టనున్నారు. 12వ పిఆర్‌సి, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సిపిఎస్ రద్దు, యాప్‌ల భారం తగ్గించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్లతో చేపట్టే ఈ ధర్నాకు పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆయన ధర్నాలో ప్రత్యక్షంగా పాల్గొనున్నారు.

బోధనేతర పనుల నుంచి తప్పించాలి.. ★★★

కె.శ్రీరామకృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు

నిత్యం ఏదోక పని చెప్పడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాం. యాప్ భారం ఎక్కువైంది. వెరీ అర్జెంట్, మోస్ట్ అర్జెంట్ అంటూ మెసేజీలు పెడుతూ పదేపదే సమాచారం, ఫొటోలు అడుగుతుండటంతో సమయం వృథా అవుతోంది. పాఠాలు బోధించేందుకు కూడా సమయం సరిపోవట్లేదు. ఉపాధ్యాయులతో ఇన్ని రకాల పనులు చేయించుకోవడం సరైంది కాదు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలి.

వృత్తినే అవమానిస్తున్నారు.. ★★★

కె.త్రిమూర్తులు, ఉపాధ్యాయులు

ఒకప్పుడు ఉపాధ్యాయులకు ఎంతో గౌరవం ఉండేది. రానురాను ఉపాధ్యాయులను ప్రభుత్వం చులకనగా చూస్తోంది. ఉపాధ్యాయ వృత్తినే అవమానించేలా వ్యవహరిస్తోంది. ఇది ఎంతవరకు సమంజసం. బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలి. యాప్‌లు తగ్గిస్తామని చెప్పినా అన్ని అప్లికేషన్లు ఒకే యాప్‌లోకి తీసుకొచ్చి నానాయాతన పెడుతున్నారు. ఇలా అదనపు పనులు అప్పగిస్తే విద్యార్థులకు పాఠాలు ఎవరు బోధిస్తారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం ★★★

పిఎస్.విజయరామరాజు, ఫ్యాప్టో ఛైర్మన్

ఉపాధ్యాయులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. అయినా విధులకు హాజరై అటు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంతోపాటు ఇటు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఉపాధ్యాయులపై కక్షగట్టినట్లుగా వ్యవహరిస్తోంది. ఇది అత్యంత దారుణం. 12వ పిఆర్‌సి ఎప్పుడిస్తారో తెలియడం లేదు. మధ్యంతర భృతి చెల్లించట్లేదు. సిపిఎస్ రద్దు చేస్తామని మాట మార్చారు. కారుణ్య నియామకాల ఊసే లేదు. యాప్‌లు, ఆన్‌లైన్ పనుల భారం ఎక్కువగా ఉంటోంది. బదిలీ ఉపాధ్యాయులకు రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వట్లేదు. ఇన్ని సమస్యలతో ఉపాధ్యాయులు నలిగిపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళన ఉధృతం చేస్తాం.

ఆర్థికపరమైన సమస్యలు పరిష్కరించాలి..

బొర్రా గోపీమూర్తి, పిడిఎఫ్ ఎంఎల్‌సి

గత ప్రభుత్వం ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టి అవమానించిందని, తమ ప్రభుత్వం వస్తే ఉపాధ్యాయులను గౌరవంగా చూస్తామని ఆనాడు ప్రస్తుత పాలకులు ప్రకటించారు. అయితే ఈ ఏడాదిలో ఉపాధ్యాయుల గౌరవాన్ని మరింత దిగజార్చారు. పాఠశాలలు తెరిచి రెండు నెలలవుతున్నా ఉపాధ్యాయులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పాఠాలు చెప్పే పరిస్థితి లేదు. అనేక పథకాలను ఆన్‌లైన్ చేయాలంటూ బోధనేతర పనులు అప్పగించి మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. మరోవైపు హ్యాండ్‌బుక్స్ పేరు చెప్పి విద్యకు దూరం చేస్తున్న పరిస్థితి ఉంది. 2023 జులై 30వ తేదీతో 11వ పిఆర్‌సి అయిపోయింది. తర్వాత 12వ పిఆర్‌సి ఇవ్వాల్సి ఉంది. తమ ప్రభుత్వం ఎన్నికైతే మంచి పిఆర్‌సి ఇస్తామని చెప్పి నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు చెప్పారు. అధికారంలోకొచ్చి సంవత్సరమైనా ఇప్పటి వరకు దాని ఊసేలేదు. వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్ వేసి మధ్యంతర భృతి ప్రకటించాలి. ప్రభుత్వం వచ్చి ఏడదవుతున్నా ఒక్క డిఎ కూడా ఇవ్వలేదు. ఇప్పటికే నాలుగు డిఎలు పెండింగ్లో ఉన్నాయి. సరెండర్ లీవులు పెట్టుకుని మూడేళ్లవుతుంది. ఇన్‌కమ్ ట్యాక్స్‌లు కూడా కట్టుకున్నారు. రిటైరైన ఉద్యోగులకు గ్రాట్యూటీ ఇప్పటివరకు ఇవ్వలేదు. తక్షణం ప్రభుత్వం సంఘాల నాయకత్వాన్ని పిలిచి చర్చించి డిమాండ్లను పరిష్కరించాలి.

ఉపాధ్యాయ సమస్యలపై ఎస్‌టిఎఫ్‌ఐ అలుపెరగని పోరు

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్‌టిఎఫ్‌ఐ ఆవిర్భావం నుంచి అలుపెరగని పోరాటం చేస్తుందని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ఎస్‌టిఎఫ్‌ఐ రజతోత్సవంలో భాగంగా ఆయన శుక్రవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోపీమూర్తి మాట్లాడారు. ఎస్‌టిఎఫ్‌ఐ స్థాపించి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా అందరికీ రజతోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సిపిఎస్ రద్దు, నూతన విద్యావిధానం వంటి సమస్యలపై దేశవ్యాప్తంగా ఉద్యమాలు ఎస్‌టిఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అనేక చోట్ల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ యుటిఎఫ్‌గా, ఎస్‌టిఎఫ్‌ఐగా ఇంతవరకు సాధించిన హక్కులను కాపాడుకునేందుకు మనం నిరంతరం పోరాటాలు చేయాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జివివి.రామానుజరావు మాట్లాడగా నేతలు సిహెచ్.కుమారబాబ్జి, జి.రామకృష్ణంరాజు, జి.అబ్రహం, నాగిడి నరసింహయ్య, బొర్రా నాగబాబు, ఎం.శివరామరాజు, కొల్లాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోపీమూర్తి

ఆ పనులు.. మృత్యు పాశాలు..!

- 165 జాతీయ రహదారిపై రాకపోకలకు జనం బెంబేలు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- కాంట్రాక్టర్ అంతులేని నిర్లక్ష్యం
- అధికారుల ఉదాశీన వైఖరి
- వెరసి వాహనదారుల ప్రాణాలు బలి

హెచ్చరిక బోర్డులు లేకుండా ప్రమాదకరంగా నిలిచిన పనులు

ప్రజాశక్తి - మండవల్లి

పనుల్లో ఎడతెగని జాప్యం.. అడుగడుగునా అంతులేని నిర్లక్ష్యం.. వెరసి ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇది కైకలూరు నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారి 165పై దుస్థితి. జాతీయ రహదారి పనుల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు ప్రమాదాలు బారిన పడి మృత్యువాత పడుతున్నారు. లింగాల గ్రామ పరిధిలో అసంపూర్తిగా వదిలేసిన జాతీయ రహదారి పనుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గత బుధవారం చోటు చేసుకుంది. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల 165వ జాతీయ రహదారి విస్తరణ పనులు మూడేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల వంతెనల వద్ద, మలుపుల వద్ద రహదారి అభివృద్ధి చేయకుండా కాంట్రాక్టర్ వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పనులు అసంపూర్తిగా ఉన్న చోట్ల, వంతెనల వద్ద ప్రమాద సూచిక బోర్డులు పెట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కన్పిస్తోంది. దీంతో ముదినేపల్లిలో కారు ప్రమాదంలో మాజీ శాస్త్రవేత్త మృతి చెంది రోజులు గడవక ముందే లింగాల వద్ద అసంపూర్తిగా వదిలేసిన కల్వర్టు వద్ద యువకుడు మృతి చెందడం ఈ మార్గంలో రాకపోకలంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. పనుల నిర్వహణలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పట్ల అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తుండటంతో ప్రజల ప్రాణాలకు ముప్పు తప్పడం లేదు. లింగాల వద్ద ప్రమాదం జరిగిన తర్వాత తూములను ఏర్పాటు చేసి పేపర్ టేపులను అతికించడంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందుగానే ఈ పని చేసి ఉంటే ఒక నిండు ప్రాణం బలి కాకుండా ఉండేదిగా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని విస్తరణ పనులకు అమాయక వాహనదారులు బలి కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎన్‌హెచ్ ఎఇ శరత్‌ను వివరణ కోరగా జాతీయ రహదారి విస్తరణ పనుల వల్ల వాహనదారులు మృతి చెందడం విస్మయానికి గురి చేస్తుందన్నారు. ముదినేపల్లిలో ప్రమాదం సంభవించి సైంటిస్ట్ మృతి చెందిన ఘటన మరువకముందే లింగాల వద్ద కల్వర్టు ప్రాంతంలో ద్విచక్ర వాహదారుడు మృతి చెందడం బాధాకరమని తెలిపారు. పనులు నిర్మించే ప్రాంతాల్లో, అసంపూర్తిగా వదిలేసిన చోట తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని హెచ్చరించినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.



కల్వరు నిర్మాణానికి తవ్విన గోతిలో పడిన కారు (ఫైల్‌ఫొటో)

మచ్చుకు కొన్ని ప్రమాదాల వివరాలు:

1.అధికారుల బాధ్యతారాహిత్యం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఫలితంగా జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన డ్రెయినేజీ పనుల వల్ల కూలీ మృతి చెందిన ఘటన మండవల్లిలో చోటుచేసుకుంది.

2.రహదారి కోసం తీసుకొచ్చిన తారును నిర్లక్ష్యంగా రోడ్డుకు అడ్డంగా గుట్టగా వేయడంతో ద్విచక్ర వాహనదారుడు అది కన్పించక గుట్టపైకెక్కి పడిపోయిన ఘటనలో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన భైరవపట్నం వద్ద చోటుచేసుకుంది.

3.రోడ్డు పక్కనే కంకర, రబ్బీష్ గుట్టలను నిర్లక్ష్యంగా ఏర్పాటు చేయడంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కంకర గుట్టలను ఢీకొని ఒక పాస్టర్ మృతి చెందిన ఘటన పెరికిగూడెం శివారు కొర్లపాడు రోడ్డు సమీపంలో జరిగింది.

4.అసంపూర్తిగా వదిలేసిన రహదారి ప్రాంతంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ముదినేపల్లి వద్ద కారు అదుపుతప్పిన ఘటనలో శాస్త్రవేత్త మృతి చెందారు.

5.లింగాల డ్రాప్ వద్ద రహదారి విస్తరణ పనులు సగం మాత్రమే చేసి హెచ్చరిక బోర్డులేవీ పెట్టకపోవడంతో రహదారి ఉందని అనుకోని ముందుకెళ్లడంతో లారీ బోల్తా పడి డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు.

6.రోడ్డుపై కల్వర్టు నిర్మాణానికి గొయ్యి తవ్వి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఆ గోతిలో పడిన కారులో పలువురు గాయాల పాలైన ఘటన ప్రత్తిపాడు స్టేజీ వద్ద చోటుచేసుకుంది.

అమెరికా సుంకాలతో ఆక్వా రైతులకు తీవ్ర నష్టం

- ప్రజానీకం నష్టపోతున్నా నోరు మెదపని ప్రధాని మోడీ
- సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శ

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాల కారణంగా మన ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర పడుతుందని, ముఖ్యంగా ఆక్వా రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. అమెరికా విధించిన సుంకాలతో భారత ప్రజానీకం నష్టపోతున్నా ప్రధాని మోడీ కనీసం నోరు మెదపకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. స్థానిక ప్రకాశం చౌక్‌లో సిపిఎం ఆధ్వర్యంలో అమెరికా సుంకాలు, ట్రంప్ వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సుంకాలు జిల్లాలో ప్రధానంగా 70 శాతంగా ఉన్న సముద్ర ఉత్పత్తులు, రొయ్యల ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. అమెరికాలో భారత్ రొయ్యల ధర భారీగా పెరుగుతుందన్నారు. దీంతో ఎగుమతులు క్షీణించి ఆక్వా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. దీన్ని ప్రజానీకం అంతా తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. రష్యా, చైనా వంటి దేశాలు అమెరికా సుంకాలను వ్యతిరేకిస్తుంటే మన ప్రధాని మోడీ మాత్రం నోరు మెదపకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. వీటిపై ఇంకా అధ్యయనం చేస్తున్నామని మోడీ చెబుతుండటం మోసకారితనమన్నారు. తక్షణం అమెరికా సుంకాలు ఉపసంహరించుకునేలా ప్రధాని మోడీ ట్రంప్‌పై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, కె.క్రాంతిబాబు, నాయకులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పెచ్చెట్టి నరసింహమూర్తి పాల్గొన్నారు.

పింఛన్ల సొమ్మును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

పింఛన్ అందిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్ల సొమ్మును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గొరగనమూడిలో వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లు స్థానిక జ్ఞానానంద వృద్ధాశ్రమం వద్ద 15 మందికి ఆయన పెన్షన్లను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఆర్థిక, ఆరోగ్య పరిస్థితి, పిల్లల చదువులు గురించి అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల ఇళ్లలో తాగునీటి కుళాయి, కరెంటు సౌకర్యం, డ్రెయినేజీ సదుపాయం ఉన్నదీ లేనిది అడిగారు. ఈ సందర్భంగా మిండేలా వీరాస్వామికి ఐటిఐ మెకానికల్ విభాగంలో శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించాలని, గండికోట దుర్గకు కుట్టు మిషన్ ఇప్పించాలని డిఆర్‌డిఎ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛను పథకం కింద జిల్లాలో 2,26,995 మందికి పెన్షన్ల పంపిణీ ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభమైందన్నారు. ఈ నెల నుండి ప్రభుత్వం స్పౌజ్ పింఛన్ల కింద జిల్లాలో 3,988 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిపిఎం మురళీకృష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ ఎన్‌విఎస్.రాంప్రసాద్, విఆర్ఒ కె.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పి.సరళ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్ల: ఈ నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. శుక్రవారం కోపల్లె, వేంపాడు గ్రామాల్లో కొత్త స్పౌజ్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాధరాజు, గ్రామ సర్పంచి బూడి నాగమణి, ఉప సర్పంచి బూడి వెంకట పద్రాలు, మాజీ ఎంపిపి అరేటి వెంకట రత్నప్రసాద్, నంద్యాల రామరాజు (హాట్‌లైన్స్ బాబు), కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజలపై భారాలు మోపే స్మార్ట్‌మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెదగర్వు గ్రామంలో ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో భూపతి శామ్యూల్, తోటి శుభకర రావు, షెడ్రిక్ తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం అదానీ కంపెనీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించొద్దని ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం వీరవాసరంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంచుతూ, నినాదాలు చేస్తూ ప్రచార యాత్ర సాగించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొర్రా ఆలమహారాజు, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ఇప్పటికే ట్రూఅప్, సర్‌ఛార్జీల పేరుతో విపరీతంగా బిల్లులు పడుతున్నాయన్నారు. తక్షణం స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న కరెంట్ ఆఫీస్ వద్ద ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల నేతలు నారాయణమూర్తి, అయినంపూడి బాబూరావు, సుబ్బారావు, శ్యామ్‌బాబు, కొత్తల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు: స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ట్రూఅప్ ఛార్జీలను ఉపసంహరించాలని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజావేదిక ఆధ్వర్యంలో స్థానిక మహిళా మండలి భవనంలో జవ్వాది శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాజగోపాల్ మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల వల్ల వచ్చే నష్టాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామన్నారు. ఈ నెల ఐదోతేదీన విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు దేవ సుధాకర్, టి.గంగరాజు, యాకల్ రాము, వై.అజయ్‌కుమార్ తదితరులు మాట్లాడారు.

యలమంచిలి: అదాని విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని, వీటిని ప్రజలంతా వ్యతిరేకించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని ఏనుగువానిలంక, బాడవ, కలగంపూడి, చించినాడ తదితర గ్రామాల్లో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రచారం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే ప్రజల నుండి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా నాయకులు కానేటి బాలరాజు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి జార్జి, మాసవరపు సుబ్బారావు, దేవ సుధాకర్, గూడూరు నాగేశ్వరరావు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి మండలంలో..

వీరవాసరంలో..

పాలకొల్లులో మాట్లాడుతున్న రాజగోపాల్

సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఉండి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కె.రోహిత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉండి మండలం యండగండిలో ఉన్న జూనియర్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని డిఐఇఒకు ఎస్ఎఫ్ఐ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ కళాశాలలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, వాటి నుండి వచ్చే దుర్వాసన వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మరుగుదొడ్లలోని పైపుల ద్వారా వాటర్ రావడం లేదని, తరగతి గదులు శ్లాబ్ పెచ్చులూడిపోయి వర్షపు నీరు కారిపోతుందన్నారు. కళాశాల ఆట స్థలం, కళాశాల పరిసరాల్లో చెత్త విపరీతంగా పెరిగి పాములు తరగతి గదుల్లోకి వస్తున్నాయని, ప్రిన్సిపల్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. సంబంధిత అధికారులు ఈ సమస్యపై వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులను ఐక్యం చేసి డిఐఇఒ కార్యాలయ ముట్టడికి పిలుపునిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బి.సింధు, పి.సాయికృష్ణ, వై.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

సిఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా నాగ దుర్గారావు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మండలం చామకూరివారిపాలెం గ్రామానికి చెందిన చామకూరి నాగదుర్గారావు సిఐఎస్‌ఎఫ్ ఉద్యోగం సాధించారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఈ విజయాన్ని అందుకున్నారు. అతని సోదరుడు శ్రీనివాస్ ఇప్పటికే ఢిల్లీలో సిఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌ పనిచేస్తున్నారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించడంపై గ్రామస్తులు నాగదుర్గారావును అభినందించారు.

ఎంఎల్‌ఎ అంజిబాబును కలిసిన ఆర్‌టిఒ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా రవాణా శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన డిఎస్‌ఎస్ నాయక్ శుక్రవారం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను వారి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ద్విచక్ర వాహనదారులకు ప్రభుత్వ ప్రయివేటు డ్రైవర్లు ప్రతినెలా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజా పాలనలో ప్రభుత్వాధికారుల పాత్ర ఎంతో కీలకమన్నారు.

రాయకుదురు హైస్కూల్‌కు బీరువా బహూకరించిన సూర్యవాణి

హైస్కూల్‌కు బీరువా బహూకరణ

ప్రజాశక్తి - వీరవాసరం

రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏనిమిదేళ్ల పాటు భౌతికశాస్త్ర సహాయకురాలుగా విధులు నిర్వహించిన సూర్య వాణి తన ఆర్థిక సాయంతో రూ.1,5000 విలువచేసే బీరువాను శుక్రవారం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావుకు అందజేశారు. ఇటీవల జరిగిన బదలీల్లో అరట్లకట్ట హైస్కూల్‌కు బదలీ అయిన కాశీనాధుని సూర్యవాణి, జగన్నాధరావు దంపతుల గుర్తుగా హైస్కూల్‌కు ఉపయోగపడే విధంగా బీరువాను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ఆర్.తులసీప్రదీప్, కెవిడి.ప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గన్నారు.

లంగ్ కేన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నరసాపురం

ఊపిరితిత్తుల కేన్సర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అశ్వినీ ఆసుపత్రి డాక్టర్ మాదంశెట్టి పద్మావతి సూచించారు. శుక్రవారం ప్రపంచ లంగ్ కేన్సర్ డేను పురస్కరించుకుని శ్రీసూర్య డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. లంగ్ కేన్సర్ వ్యాప్తిలో ప్రపంచంలో మన దేశం ద్వితీయ స్థానంలో ఉందన్నారు. ముఖ్యంగా దూమపానం కారణంగా ఈ వ్యాధి వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు దూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మంచి ఆరోగ్య అలవాట్ల వల్ల ఇలాంటి వ్యాధులు రాకుండా నివారించవచ్చని చెప్పారు. అనంతరం లంగ్ కేన్సర్‌పై పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టామని డిపిఒ ఎస్.రామ్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆయన మండలంలోని పాతపాడు, కొత్తోట, మొగల్తూరుల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి స్థలాలను ఎంపిక చేస్తున్నామన్నారు. పంచాయతీల ఆదాయం పెంచేందుకు జిల్లాలోని గ్రామాల్లో ఉపాధి నిధులతో సుమారు 30 వేల కొబ్బరి మొక్కలు నాటించామన్నారు. పంచాయతీల్లో ఐదెకరాల పైబడి ఉన్న చెరువులను ప్రభుత్వం అభివృద్ధి చేయనుందని, వాటిని గుర్తించి వెంటనే నివేదిక అందించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. డంపింగ్ యార్డు స్థల సమస్య ఉన్నచోట పరిష్కారానికి స్థలాల ఎంపిక, చెత్త తరలింపు తదితర వాటికి కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. పండితవిల్లూరులో నిధుల దుర్వినియోగంపై సర్పంచి, గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకున్నామన్నారు. అనధికార లేఅవుట్లలో రిజిస్ట్రేషన్ జరగకుండా నిషేధిత జాబితాలో చేరుస్తున్నామని చెప్పారు. తాడేపల్లిగూడెంలో మురుగు సమస్య నివారణకు ప్రయోగాత్మకంగా మేజిక్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఆయన వెంట ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, డిప్యూటీ ఎంపిడిఒ మేడిది నవీన్‌కిరణ్, పంచాయతీ కార్యదర్శులు ముచ్చర్ల నాగేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, బి.కృష్ణప్రసాద్, సర్పంచి పడవల మేరీసత్యనారాయణ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మొగల్తూరు:వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ వై.నాగలక్ష్మి సూచించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో శుక్రవారం వాహన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలను వాహన చోదకులకు విధించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు.

కోమటిగుంటలో గ్రామోత్సవం

కాళ్ల:కోమటిగుంట గ్రామస్తులంతా ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని, ఏటా శ్రావణమాసంలో అమ్మవారికి సారె గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. కోమటిగుంటలో కోదండ రామాలయంలో నుంచి శుక్రవారం వివిధ పిండి వంటలతో గ్రామోత్సవాన్ని నిర్వహించి అమ్మవారికి సారె సమర్పించారు. గత 45 సంవత్సరాలుగా గ్రామంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కెవిఎల్ సీ ఫుడ్స్ అధినేత మంతెన నాగాంజనేయులు తన వంతు సహకారం అందిస్తున్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు యలమంచిలి వెంకట రమణ, యలమంచిలి రామాంజనేయులు, మంతెన నాగాంజనేయులు, యలమంచిలి శ్రీనివాస్, యలమంచిలి గణపతి, పులమంతుల ఏసురాజు, యలమంచిలి బాబ్జి పాల్గొన్నారు.

పెన్షన్ సొమ్ము చోరీ

నరసాపురం:పట్టణంలోని టేలర్‌పేట సచివాలయంలో పనిచేస్తున్న విఆర్‌ఒ నిప్పులేటి లక్ష్మీగణపతి బైక్ డిక్కీలో ఉంచిన రూ.2.56 లక్షల పెన్షన్ నగదు మాయమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జులై 31వ తేదీ గురువారం పెన్షన్ సొమ్ము వెల్ఫేర్ అసిస్టెంట్ నుంచి తీసుకుని పంపిణీ నిమిత్తం అంతా సిద్ధం చేసుకున్నారు. నగదును 4000, 6000 వేలుగా విభజించి బైక్ డిక్కీలో పెట్టి పట్టణంలో జరుగుతున్న బంధువుల పెళ్ళికి హాజరయ్యారు. తిరిగి తన స్వగ్రామం మండలంలోని కంసాల బేతపూడి ఇంటికి వెళ్లి డిక్కీ ఓపెన్ చేసి చూడగా నగదు పోయినట్లు గుర్తించి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. విఆర్‌ఒ ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ సొమ్మును సర్దుబాటు చేసుకుని యథావిధిగా ఆ ఉద్యోగి శుక్రవారం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

భీమవరం బుల్స్ విజయం సాధించాలి

డిప్యూటీ స్పీకర్ రఘురామ, పిఎసి చైర్మన్ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) భీమవరం బుల్స్ లోగో, జెర్సీ (డ్రెస్ కోడ్)ని భీమవరంలో శుక్రవారం పిఎసి చైర్మన్, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు, క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమవరం బుల్స్ టీమ్ విజయం సాధించి కప్‌తో భీమవరం రావాలని ఆకాంక్ష వెలిబుచ్చారు. భీమవరం పేరు పెట్టినందుకు భీమవరం ఖ్యాతి నిలిచేలా క్రీడాకారులు కూడా కష్టపడి ఆడాలని కోరారు. ఎపిఎల్ భీమవరం బుల్స్ టీమ్ కెప్టెన్ నితీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎపిఎల్ లీగ్స్‌తో ఆంధ్రప్రదేశ్ ఉన్న క్రీడాకారులకు జాతీయస్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుందని, అందువల్లే దీనిని ఎపిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 8 నుండి 23 వరకు విశాఖపట్నంలో ఏడు జట్లతో ఎపిఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

తాడేపల్లిగూడెం : పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - గణపవరం

రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం గణపవరంలో ప్రభుత్వం విడుదల చేసిన స్పౌజ్ పెన్షన్లు స్థానిక వెలంపేటలో మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పౌజ్ పెన్షన్ కేటగిరీ కింద కుటుంబంలో పింఛన్ పొందే భర్త చనిపోయిన తరువాత మరణ ధృవీకరణ పత్రం అధికారులకు అందజేస్తే భార్యకు ప్రభుత్వం కొత్తగా పెన్షన్ ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం అమలుజేస్తోందన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 557 మంది స్పౌజ్ పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తెలుగు మహిళలు, వీర మహిళలతోపాటు, గణపవరం సర్పంచి మూరా అలంకారం, ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : పేదల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం 38వ వార్డు లంకపేటలో శుక్రవారం కొత్తగా స్పౌజు పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ అంజిబాబు ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. భీమవరంలో మొత్తం 10,970 మందికి రూ.4,83,13,500లు అందిస్తున్నామని, కొత్తగా 203 మందికి స్పౌజ్ పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. భీమవరం మండలంలో కొత్తగా 178 మందికి, రాయలం గ్రామంలో 20 మందికి స్పౌజ్ పెన్షన్ పంపిణీ చేశామని ఎంఎల్‌ఎ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి భీమవరం పట్టణ అధ్యక్షుడు మద్దుల రాము ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక 31వ వార్డు బలుసుమూడిలో, 4వ వార్డు నరసయ్య అగ్రహారంలో నిర్వహించారు. ముందుగా సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు కూటమి నాయకులు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో మొదటి విడతగా రూ.7 వేల రూపాయల నగదు జమ



గణపవరం : పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ

చేస్తున్నామన్నారు. పట్టణ మాజీ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు మాట్లాడారు.

పెనుమంట్ర : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పొలమూరులో పలువురు వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వెలగల బుల్లి రామిరెడ్డి, జి.మురళీ, చింతపల్లి రామకృష్ణ, తహాశీల్దార్ వై.రవికుమార్, ఇఒపిఆర్‌డి వల్లభు రాంబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి వితంతు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయం వద్ద వితంతు పెన్షన్లు అందజేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలకు గాను 533 మందికి పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, జనసేన పట్టణ అధ్యక్షులు వర్దనపల్లి కాశి పాల్గొన్నారు.

మొగల్తూరు : కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని ముస్లిం మైనార్టీల వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడు ఎంఎ షరీఫ్ అన్నారు. మొగల్తూరు పంచాయతీ కుక్కలవారితోట సచివాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ



ఆచంటలో..

సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం నేతలతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, మొగల్తూరు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బొల్లా చంటి, పిఎంఎ.రాజు, పాల రాంబాబు బోనం నరసింహారావు, డొల్ల రత్నంరాజు, పంపన భగవాన్ పాల్గొన్నారు.

పాలకొల్లు : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భర్త చనిపోయిన వారికి స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసినట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు చెప్పారు. పాలకొల్లులో 123 మందికి వితంతు పింఛన్లు కూటమి నేతలు మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ విజయ సారధి, ఇంజినీర్ రాజకుమార్, టిపిఒ వీరభద్రం, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆచంట: కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్ర పురోభివృద్ధి సాధ్యమని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. కరుగోరుమిల్లి, వల్లూరు గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు అల్లం పద్మావతి, నేలపూడి బేబీ అధ్యక్షతన నూతనంగా మంజూరైన స్పౌజ్ పెన్షన్లను ఎంఎల్‌ఎ వితంతువులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం వల్లూరులో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, ఎంపిడిఒ బిఎస్‌ఎస్.కృష్ణమోహన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉండి : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేసి వారికి ఆర్థికంగా భరోసా ఇస్తామని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు. కోలమూరు, ఉప్పులూరు గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతనంగా 148 స్పౌజ్ పెన్షన్లు అందజేశామని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు నాగరాజు, జనసేన మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కోలమూరు నీటి సంఘం అధ్యక్షులు యర్రా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - తణుకు

ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు విమర్శించారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అనుబంధం సమావేశం ఉపాధ్యక్షులు వాటాల నాగేశ్వరరావు అధ్యక్షతన స్థానిక పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికుల శ్రమతో నిర్మించిన నిర్మాణాల ద్వారా సంక్షేమ బోర్డుకు జమవుతున్న సెస్ నిధిని అధికారంలో ఉన్న పాలక ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు నుంచి నిధులు ఇతర అవసరాలకు దారి మళ్లించాయని తెలిపారు. దారి మళ్లించి వాడుకున్న సంక్షేమ బోర్డు నిధులను తిరిగి చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అమలు చేయకుండా లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అందించకుండా ఉద్దేశ పూర్వకంగానే ప్రభుత్వాలు ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చిత్తశుద్ధితో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి వెంకన్న, సోరపల్లి రామకృష్ణ, తిరునాదం వెంకటేశ్వరరావు, దున్నే రుద్ర నాగేశ్వరరావు, అల్లాడి నాగ బలరాం, ఆనందం, గంగాధర్ పాల్గొన్నారు.

వెంకటస్వామికి సిపిఎం నాయకుల పరామర్శ

యలమంచిలి:చించినాడకు చెందిన సిపిఎం నాయకుడు పల్లేరు వెంకటస్వామి ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో ఆయనను శుక్రవారం సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, దేవ సుధాకర్, ఆకుమర్తి ఏసు రత్నం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కొబ్బరి ఒలుపు, దింపు కార్మికులను ఆదుకోవాలి

మొగల్తూరు:కొబ్బరి దింపు, ఒలుపు కార్మికులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కెపి.పాలెంలో కార్మికులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 10 లక్షల మంది కార్మికులు కొబ్బరి ఒలుపు దింపుపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కేరళ మాదిరిగానే రాష్ట్రంలో సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎడ్ల చిట్టిబాబు, మట్టపర్తి శ్రీను, గుబ్బల నాగరాజు, హనుమంతరావు, కె.దుర్గారావు, తంగేళ్ల జలంధర్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి : యుటిఎఫ్

ఆకివీడు :ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పిలుపుమేరకు ప్రతి ఒక్కరూ కదలిరావాలని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్‌విఎస్.నారాయణ (విక్రమ్) పిలుపునిచ్చారు. ఈ నెల రెండో తేదీ శనివారం భీమవరం జిల్లా కలెక్టరేట్ వద్ద చేపడుతున్న ధర్నాలో ఉపాధ్యాయులు, ఎంఇఒలు, హెచ్‌ఎంలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. 12వ పిఆర్‌సి ఇప్పటివరకూ నియమించలేదన్నారు. కారుణ్య నియామకాలు, సిపిఎస్ రద్దు, ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించడం వంటి సమస్యల పరిష్కారం కోసం ఈ ఆందోళన చేపట్టినట్లు చెప్పారు.

సిఎం సహాయ నిధి పేదలకు వరం

నరసాపురం:సిఎం సహాయనిధి పేదల పాలిట వరమని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డులో లబ్ధిదారులకు ఎంఎల్‌ఎ సిఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడారు. నియోజకవర్గంలోని ఐదుగురుకి రూ.4,44,789 చెక్కులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, ఘంటా కృష్ణ, కోటిపల్లి వెంకటేశ్వర రావు, వలవల నాని, తారక రామారావు పాల్గొన్నారు.

నేడు కోమర్రులో ఉచిత గుండె వైద్యశిబిరం

గణపవరం:మండలంలోని కోమర్రులో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు కోమర్రు గ్రామ పెద్దలు వడ్డి ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వైద్య శిబిరంలో బిపి షుగర్, గుండెకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తారని చెప్పారు. వైద్య శిబిరంలో విజయవాడకు చెందిన గుండె డాక్టర్ వైవి.రావు పాల్గొంటారని చెప్పారు. కోమర్రు చుట్టుపక్కల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

సొసైటీని అగ్రస్థానంలో నిలపాలి : ఎంఎల్‌ఎ



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

పెనుమంట్ర:రైతులకు సేవ చేయడంతో పాటు, డిపాజిట్లు పెంచడం ద్వారా సొసైటీని అగ్రస్థానంలో నిలపాలని ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పొలమూరు పిఎసిఎస్ ప్రాంగణంలో జరిగిన సొసైటీ నూతన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుతం 30 కోట్ల రూపాయల టర్నోవర్ ఉందని, ఇది మరింత పెరగాలని, పాల కేంద్ర నిర్వహణ ఇంకా పురోగతి సాధించాలని తెలిపారు. సొసైటీ రిజిస్ట్రార్ ముజిబుర్ రహమాన్ నూతన ఛైర్మన్ కండిబోయిన శ్రీనివాస్, సభ్యులు పసుపులేటి నాగ ధనలక్ష్మి, చీపురుపల్లి ఆంజనేయులతో ప్రమాణ స్వీకారం చేయించారు. తమను ఈ నామినేటివ్ పదవులకు ఎంపిక చేయడం పట్ల త్రిసభ్యులు ఎంఎల్‌ఎ పితానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కమిటీ అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, కార్యదర్శి జి.మురళీ మోహన్, క్లస్టర్ కన్వీనర్, మాజీ సర్పంచి చింతపల్లి రామకృష్ణ, పలువురు కూటమి నాయకులు ప్రసంగించారు. గ్రామ సర్పంచి కాకర్ల రాజేశ్వరరావు, అధికారులు, కూటమి నాయకులు, సొసైటీ రైతులు పాల్గొన్నారు.

ఎబిఎస్‌వికె ట్రస్టుకు రూ లక్ష భూరి విరాళం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ట్రస్టుకు విరాళం అందజేస్తున్న గోపాలకృష్ణరాజు

స్థానిక మెంటే వారితోట సుందరయ్య భవనంలో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య సహాయ కేంద్రానికి మోగల్లు గ్రామానికి చెందిన కలిదిండి గోపాలకృష్ణరాజు దంపతులు బూరి విరాళంగా రూ.లక్ష ఇచ్చినట్లు ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం తెలిపారు. సేవలను గుర్తించి దాతృత్వంతో ముందుకొస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య సహాయ కేంద్రం ద్వారా రెగ్యులర్‌గా వైద్యునిచే ఉచిత ఒపి నిర్వహిస్తున్నామన్నారు. డయోగ్నస్టిక్ సెంటర్ ద్వారా ఉచితంగా ఇసిజి, రక్త పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి మూడు నెలలకోసారి బిపి, షుగరు, ఫిట్స్, పెరాలసిస్ పేషెంట్లకు మెడికల్ క్యాంపు పెట్టి మూడు నెలలకు రూ.300కే మెడిసిన్స్ అందిస్తున్నామన్నారు. ప్రతినెలా చిన్నపిల్లలకు గుండె మెడికల్ క్యాంపులో 2డి ఎకో పరీక్షలు చేసి శస్త్రచికిత్స అవసరమయ్యే పిల్లలకు విజయవాడలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు సుమారుగా 50 మంది పిల్లలు గుండె ఆపరేషన్లు చేయించుకున్నట్లు తెలిపారు. ఉచితంగా కుట్టు, కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది జి.నాగరాజు, లత, రత్నకుమారి పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

ప్రజాశక్తి - పాలకోడేరు

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని సిడిపిఒ వాణి విజయరత్నం సూచించారు. పాలకోడేరు, శృంగవృక్షం అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్లు పార్వతి, సూర్యకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలను సిడిపిఒ వాణి విజయరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యత, తల్లీబిడ్డ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సిడిపిఒ వాణి విజయరత్నం మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తల్లిపాల వారోత్సవాలు చేపట్టిందన్నారు. వారం రోజులపాటు అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యత, అంగన్వాడీ ద్వారా అందిస్తున్న సేవలు వివరించడం జరుగుతుందన్నారు. బిడ్డకు తల్లిపాలే ఆరోగ్యాన్నిస్తుందన్న విషయాన్ని తల్లులు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

గణపవరం:తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని గణపవరం పిహెచ్‌సి డాక్టర్లు పి.కిరణ్మయి, ఓంకార్‌నాథ్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆసుపత్రిలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, ఎంపిహెచ్‌ఎస్ ఎం.బాలమురళీ కృష్ణ, హెచ్‌వి.పద్మజ, ఎంఎల్‌హెచ్‌పి.నున్నపాప, ఎఎన్‌ఎంఎస్.నాగవేణి పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : పుట్టిన వెంటనే శిశువులకు తల్లిపాలు అందిస్తే వారు ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక రాయలం అంగన్వాడీ సెంటర్లో పిల్లల తల్లులకు, గర్భిణులకు తల్లిపాల పోషక విలువలపై అవగాహన కల్పించారు. శిశువు జన్మించిన వెంటనే ముర్రిపాలు పట్టించాలన్నారు. అలాగే బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. భీమవరం ప్రాజెక్టు ఐసిడిఎస్ సిడిపిఒ టి.లక్ష్మీకాంతం, నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఇఒ సుజాత, సూపర్‌వైజర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పెనుగొండ : తల్లిపాలు వారోత్సవాలను వెంకటరాపురం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతలక్ష్మి సుకుబాయ్, దుర్గ

పాలకోడేరు : మాట్లాడుతున్న సిడిపిఓ వాణి విజయరత్నం

శ్యామల, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పెనుమంట్ర : తల్లిపాలు బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్య రక్ష అని ఐసిడిఎస్ పెనుమంట్ర సిడిపిఒ అంగర కృష్ణ కుమారి అన్నారు. నత్తా రామేశ్వరం, భట్లమగటూరు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలల్లో రోగ నిరోధక శక్తి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎస్.వెంకటలక్ష్మి, ఎఎన్‌ఎంలు, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

నరసాపురం : పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి ఊర్మిళ అన్నారు. ఎల్‌బిచర్ల పిహెచ్‌సి వద్ద తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లి పాలల్లో ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కె.జెరుష, సిహెచ్.దుర్గా భవాని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

13న బార్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 13వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లిమిల్లి జోసఫ్ చెప్పారు. ఈ నెల 4వ తేదీ నుంచి ఎన్నిక ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. 4, 5వ తేదీల్లో రెండు రోజుల పాటు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ అర్హులైన న్యాయవాదుల నుంచి నామినేషన్లు స్వీకరించడం జరుగుతందన్నారు. 6వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. 7వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణకు సమయం ఉంటుందని చెప్పారు. 13న ఉదయం 10.30 గంటల నుంచి పోలింగ్ తరువాత కౌంటింగ్ ఎన్నికైన పాలకవర్గం ప్రకటన ఉంటాయని చెప్పారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కాగుపాడు గ్రామానికి చెందిన కడియాల త్రిమూర్తులు తండ్రి విఘ్నేశ్వరరావు పొలం దస్తావేజులు జులై 28వ తేదీ అనగా సోమవారం తీసుకుని నారాయణపురం సొసైటీకి వెళ్తుండగా మార్గమధ్యలో దస్తావేజులు ఉన్న ఫైల్ జారిపోయాయి. **డాక్యుమెంట్ నెంబర్ 2399/2016** కావున డాక్యుమెంట్ ఫైల్ దొరికిన వారు ఈక్రింది అడ్రస్‌కి అందజేయగలరని కోరుచున్నాను..

కడియాల త్రిమూర్తులు
కాగుపాడు
ఉంగుటూరు మండలం
ఏలూరు జిల్లా
సెల్ నెం: 85007 08737

మహారాజశ్రీ ఏలూరు 7వ అదనపు జిల్లా జడ్జి, ఏలూరు వారి కోర్టులో

ఇ.పి.నెం.125/2021

ఇన్

ఏ.ఆర్.సి.నెం.117/2015

బిట్వీన్ :

మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఫార్ములి నౌను అస్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్), చింతలపూడి ...డి.హెచ్.ఆర్

మరియు

ముగ్గుల సుభద్ర మరియు ఇతరులు ...జె.డి.ఆర్స్

ఆర్-2: ముగ్గుల మాధవి, D/o.లక్ష్మి నారాయణ, హిందూ, ఫిమేల్, వయస్సు 25 సంIIలు, డోర్‌నెం.5-21, మెయిన్ రోడ్, ఎర్రగుంటపల్లి, చింతలపూడి.

పై గ్రంథములో మీ యొక్క వ్యక్తిగతమైన హాజరు నిమిత్తంపైన వివరించిన పిటిషను ది.06-8-2025కి వాయిదా అయి ఉన్నది. ఆరోజు ఉదయం గం.10.30 నిIIలకు పైన వివరించిన కోర్టు వద్దకు మీరు వ్యక్తిగతంగా గాని, మీ లాయర్ గారి ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియపరచవలెను. లేనిచో శ్రీకోర్టు వారి తీసుకునే నిర్ణయం నాకు మీకు అభ్యంతరము లేదని భావించబడును.

Hearing Date : 06-8-2025

K.V.S.N.R.GOPAL
Advocate, Eluru.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS, AT :: VIJAYAWADA

Arbitration Claim Petition No. 91/2024

Between:-
Kapil Chits (Kosta) Pvt. Ltd,
Rep. By it's Zonal Legal Officer,
Governorpeta Branch, Vijayawada. ....Disputant

And

Juttika Aruna Jyothi & Others ...Opponents

Notice to Opponent No. 3

Vanteddu Padmavathi, D/o. Parri Ramu, R/o. D. No. 20E-14-41, Bonu Vari Veedhi, Eluru, Eluru District. (Opponent No.3)

Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honourable Deputy Chit Registrar ordered notice to you and posted the case to 22-08-2025 for your appearance. So you are here by requested to appear before the office of Honourable Deputy Registrar of Chits Vijayawada, D. No. 55-6-7A, Opposite to Priya Childeren Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 on 22-08-2025 at 11-30 A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Honourable Deputy Registrar)

Hearing Date: 22-08-2025

A. Prasoon Kumar,
Advocate
Vijayawada

NOTICE

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION), TADEPALLIGUDEM

I.A.No.843/2024 and I.A.No.842/2024 and I.A.No.841/2024

IN

O.S.No.138/2016

Between:
1. Parimi Dinesh ... Petitioner/ Plaintiff

And

1. Parimi Bala Prabhakara Rao and others ...Respondents/defendants

To,

RespondentsNo.11 and No.12

11. Kamma Hemanth Surya Teja, S/o.Kamma Anand Kishore, Age 21 years, Hindu, Male, Student, Door No.1-46-3/3, Konevari street, Opp: Geetha Mandir, 30th ward, Tadepalligudem, TPG-PJCJC.,
12. Nallagopu Vijayalakshmi, W/o.Daiva Vara Prasada Rao, Age 43 years, Hindu, Female, near Rocket Park, old 14th ward, present 7th ward, Tadepalligudem, TPG-PJCJC.,

Please take notice that the above suit is filed by the Petitioners/plaintiffs against the Respondents/defendants. The matter is posted for the appearance of the above respondents No.11 and No.12 on **dt. 11-08-2025 from 10.30 A.M.** onwards, on which day you may appear in person or through your advocate and file your objections/pleadings if any. Otherwise, the matter will be adjudicated according to law in your absence.

G.Syama Prasad Mukherjee,
Tadepalligudem. **N.Surya Mani,** Advocates,
Date: 30-07-2025 Tadepalligudem.